epaper.telanganavaradhi.com

# తెలంగాణ వారధి

సమగ్ర తెలుగు దినపత్రిక | శుక్రవారం, 24 అక్టోబర్ 2025 | పేజీలు : 4



మహాగఠ్ బంధన్ సీఎం అభ్యర్థిగా

## తేజస్వీ

4లో









# మూడు పార్టీల మధ్యే ప్రధాన పోటీ

2

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు నామినేషన్లు ముగిశాయి. ఈ ఎన్నికల్లో అత్యధికంగా 321 నామినేషన్లు దాఖలయ్యాయి. 211మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేయడానికి నామినేషన్లు సమర్పించారు. ఈ నామినేషన్లను రిటర్నింగ్ అధికార్లు పరిశీలించారు. అయితే ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్ల విషయంలో చివరినిమిషం వరకు ఉత్కంఠ నెలకొంది.

*- తెలంగాణ వారధి, హైదరాబాద్*

- కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్
- బీఆర్ఎస్ క్యాండిడేట్‌గా మాగంటి సునీత
- బీజేపీ నుంచి బరిలో ఎల్.దీపక్ రెడ్డి



3 లో

## నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

## నేడు భారత్ బంద్ కు మావోల పిలుపు

- ఆపరేషన్ కగార్ నిలుపుదలకు డిమాండ్
- అభయ్ పేరుతో ప్రకటన విడుదల





3 లో



4 లో

## జూబ్లీహిల్స్‌లో దయన్న ప్రచార హోరు

- గడప గడపకు వెళ్తూ.. వీధి వీధి తిరుగుతూ బీఆర్ఎస్ అభ్యర్థి కోసం ప్రచారం

epaper.telanganavaradhi.com
తెలంగాణ వారధి
సమగ్ర తెలుగు దినపత్రిక



# మూడు పార్టీల మధ్యే ప్రధాన పోటీ

- కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్
- బీఆర్ఎస్ క్యాండిడేట్ గా మాగంటి సునీత
- బీజేపీ నుంచి బరిలో ఎల్.దీపక్ రెడ్డి




**హైదరాబాద్, అక్టోబర్ 23 (తెలంగాణ వారధి):**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు నామినేషన్లు ముగిశాయి. ఈ ఎన్నికల్లో అత్యధికంగా 321 నామినేషన్లు దాఖలయ్యాయి. 211మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేయడానికి నామినేషన్లు సమర్పించారు. ఈ నామినేషన్లను రిటర్నింగ్ అధికార్లు పరిశీలించారు. అయితే ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్ల విషయంలో చివరినిమిషం వరకు ఉత్కంఠ నెలకొంది.

## మాగంటి సునీత విషయంలో టెన్షన్..

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగంటి సునీత విషయంలో తొలుత ఉత్కంఠ నెలకొంది. జూబ్లీహిల్స్ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ వారసుడిని తానేనంటూ మొదటి భార్య కొడుకు తారక్ ప్రద్యుమ్న తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారికి లేఖ రాశారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై తీవ్రమైన ఆరోపణలు చేయడమేకాకుండా సునీత గోపినాథ్ భార్యే కాదంటూ తారక్ ప్రద్యుమ్న ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. సునీత అఫిడవిట్ లో తప్పుడు సమాచారం ఇచ్చారని. తారక్ ప్రద్యుమ్న ఆరోపించారు. మాగంటి గోపినాథ్‌కు చట్టబద్ధమైన ఏకైక కుమారుడిని తానేనంటూ తారక్ ప్రద్యుమ్న స్పష్టం చేశారు. దీంతో బీఆర్ఎస్ నాయకుల్లో టెన్షన్ మొదలైంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే అభ్యర్థిని ప్రకటించిన బీఆర్ఎస్ గోపినాథ్ భార్య సునీతకు టికెట్ ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. అయితే గోపినాథ్ కుటుంబ వ్యవహారంపై చివరి నిమిషంలో ఏదైనా సమస్య వచ్చి సునీత అభ్యర్థిత్వం తిరస్కరణకు గురయితే ప్రత్యామ్నయంగా ఉండాలనే ఉద్దేశంతో రెండో అభ్యర్థిగా పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డితో నామినేషన్ వేయించింది. బీఆర్ఎస్ ఊహించిన విధంగానే మొదటి భార్య తనయుడు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో సునీత అభ్యర్థిత్వంపై మరోసారి నీటినీడలు కమ్ముకున్నాయి. అయితే ఈ విషయాన్ని పరిశీలించిన ఎన్నికల కమిషన్ వివాదాన్ని కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని, ఈ విషయం ఎన్నికల సంఘం పరిధిలోకి రాదని తేల్చడంతో పాటు సునీత అభ్యర్థిత్వాన్ని ఒకే చేయడంతో బీఆర్ఎస్ ఊపిరి పీల్చుకుంది.

## నవీన్ విషయంలో కాంగ్రెస్ కలవరం..

ఇక నవీన్ యాదవ్ నామినేషన్ విషయంలోనూ చివరి నిమిషం వరకు ఉత్కంఠ కొనసాగింది. ఆయనపై గతంలోనే పలు కేసులు ఉన్నట్లు ఆరోపణలు రాగా, తాజాగా ఓటరు కార్డులు పంపిణీ చేసినట్లు క్రిమినల్ కేసు కూడా నమోదైంది. ఈ వివాదం ఇలా ఉండగానే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ నామినేషన్ పై బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమా భరత్ అభ్యంతరం వ్యక్తం చేశారు. నిర్దేశిత కాలమ్స్ లో వివరాలు నింపకుండా తప్పులు ఉన్నాయని ఆయన తన అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా బీఆర్ఎస్ ఫిర్యాదుతో నవీన్ యాదవ్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరిగి పరిశీలించారు. కాగా ఫామ్ 26 లోని మొదటి మూడు పేజీలలో ఉన్న కాలమ్స్ విషయంలో అభ్యంతరాలున్నాయని బీఆర్ఎస్ ఆరోపించింది. ఇదే కారణంతో పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారు అని బీఆర్ఎస్ తరపున న్యాయవాది భరత్ రిటర్నింగ్ అధికారి దృష్టికి తెచ్చారు. అలాంటపుడు నవీన్‌యాదవ్ అభ్యర్థిత్వాన్ని ఎలా ఒకే చేస్తారని ప్రశ్నించారు. దీనిపై రిటర్నింగ్ అధికారి ఉన్నతాధికారుల సలహా తీసుకున్నారు. ఎట్టకేలకు ఆయన అభ్యర్థిత్వాన్ని కూడా ఒకే చేయడంతో కాంగ్రెస్ వర్గాలు ఊపిరి ఆనందం వ్యక్తం చేశారు. కాగా 211మంది అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో నామినేషన్ల పరిశీలనకు అధికారులకు చాలా సమయం పట్టింది. త్రిపుల్ ఆర్ బాధితులు, మాలమహానాడు, నిరుద్యోగులు అత్యధికంగా నామినేషన్లు వేయడం కలకలం రేపింది. అయితే నామినేషన్ల పరిశీలన అనంతరం 160 మంది అభ్యర్థులు సమర్పించిన 194 నామినేషన్లు సరిగా ఉన్నట్లు నిర్ధారించారు. మిగిలిన నామినేషన్లను తిరస్కరించినట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా నామినేషన్ల ఉపసంహరణకు మరో మూడు రోజులు సమయం ఉండటంతో మిగిలిన వారిలో ఎంతమంది బరిలో ఉంటారో తేలనుంది.

## ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీలు..

కాగా జూబ్లీహిల్సి ఉప ఎన్నికను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. బీఆర్ఎస్ సిట్టింగ్‌స్థానం కావడంతో దాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలని ఆ పార్టీ ప్రయత్నిస్తుండగా, తమ అభ్యర్థిని గెలిపించుకుని నగరంలో పట్టు సాధించాలని అధికార పార్టీ ప్రయత్నిస్తోంది. ఇక బీజేపీ కూడా గెలుపు కోసం ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలోనే ప్రభుత్వానికి వ్యతిరేకంగా రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్), ఫార్మాసిటీ భూనిర్వాసితులు, నిరుద్యోగులు. మాల మహానాడు అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్లు వేశారు. అయితే వీరిలో చాలామంది నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, ఉపసంహారణకు మరో మూడు రోజులు సమయం ఉంది. ఒకవేళ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకుంటే తాము పోటీలో ఉంటామని పలువురు చెబుతున్నారు. ఈ లెక్కన చివరికి ఎంతమంది బరిలో నిలుస్తారనే విషయంలో ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం 160 మంది అభ్యర్థులు ఉండగా వీరిలో 100 మంది తప్పుకుని 60 మంది పోటీలో ఉన్నా అది చరిత్రలో నిలిచిపోతుంది. ఈవీఎం మిషన్‌లో నోటా తో కలిపి 64 అభ్యర్థులకు అవకాశం ఉంటుంది. ఒకవేళ అందరూ పోటీలో ఉంటే రెండు ఈవీఎంలు అవసరం పడుతాయి. ఒకవేళ అది సాధ్యం కానీ పరిస్థితి వస్తే బ్యాలెట్ పేపర్ తప్పనిసరి అని తెలుస్తోంది. కాగా ప్రస్తుతం పోటీలో ఉన్న అభ్యర్థులు ఉంటారా తప్పుకుంటారా మరో మూడు రోజుల్లో తేలనుంది.



# అసత్య ప్రచారాలను ఎండగట్టాలి

- టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి
- రాయపర్తి మండల సోషల్ మీడియా సమీక్ష సమావేశం

**రాయపర్తి, అక్టోబర్ 23 (తెలంగాణ వారధి ):** రాయపర్తి మండల కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సోషల్ మీడియా సమీక్ష సమావేశంలో టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ , పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసత్య ప్రచారాలను ఎండగట్టి, ప్రభుత్వ పథకాల నిజమైన ప్రయోజనాలను ప్రజలకు చేరవేయాలని సోషల్ మీడియా కోఆర్డినేటర్లకు సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా కోఆర్డినేటర్లు ఝాన్సీ రాజేందర్ రెడ్డీ గారికి శాలువాతో సత్కారం చేసి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో తొర్రూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్య నాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బండి రాజేంద్ర ప్రసాద్, టౌన్ కోఆర్డినేటర్ ఉబ్బని నవీన్, మండల కోఆర్డినేటర్ గుగులోత్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# శివలయానికి మంగళవాద్యం బహూకరణ

**రఘునాథపల్లి, అక్టోబర్ 23 (తెలంగాణ వారధి ) :** కంచనపల్లికి చెందిన శ్రీమహా పరమ శివలయానికి బీసీ కాలనీ పూజారి బత్తోజు రాకేష్ ఆచార్య ఆలయంలోని నిత్య కైంకర్యాలలో కీలకమైన హారతి నివేదన సమయంలో ఉపయోగించే మంగళవాద్య పరికరాన్ని బహూకరించారన్నారు. భక్తుల తరఫున ఈ మంగళవాద్యాన్ని ఆలయ కమిటీకి సమర్పించిన శుభసందర్భంలో ఆలయ ప్రాంగణం శివనామ స్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ 'పరమేశ్వరుడికి అత్యంత ప్రీతికరమైన ఈ మంగళవాద్యాన్ని సమర్పించిన ఆ భక్తులకు, వారి కుటుంబ సభ్యులందరికీ స్వామివారి అనుగ్రహం లభించాలి అని, వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని నిండు మనసుతో ప్రార్థిస్తున్నామని అన్నారు. అనంతరం అర్చకులు వారిని ఆశీర్వదించారు.




# మల్లంపల్లి పాఠశాలకు కుర్చీల అందజేత

**పాలకుర్తి, అక్టోబర్ 23 (తెలంగాణ వారధి) :** పాలకుర్తి మడలంలోని మల్లంపల్లి ప్రభుత్వ పాఠశాల కంప్యూటర్ విభాగానికి అవసరమైన కుర్చీలను మహాత్మా హెల్పింగ్ హ్యాండ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గంట రవీందర్ సానుభూతితో అందించారు. దాదాపు రూ.3,000 విలువ గల కుర్చీలను పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. అనిత మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యం కోసం ముందుకు వచ్చిన గంట రవీందర్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు గిరగాని సుధాకర్, మార్త శేఖర్, ఉపాధ్యాయులు ప్రవీణ్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, కవిత, ఓంకార చారి, రవికిరణ్, లత తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి

- అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే యశస్విని

**పాలకుర్తి, అక్టోబర్ 23 (తెలంగాణ వారధి ) :** పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించేందుకు పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి.బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో నియోజకవర్గంలోని రహదారి నిర్మాణాలు, గ్రామీణ మౌలిక వసతులు, డ్రైనేజ్ వ్యవస్థలు, పంచాయతీ స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులు వంటి అంశాలపై విపులంగా చర్చించారు. ఎమ్మెల్యే అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ "ప్రతి గ్రామంలో ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలి. ఏ పనీ అర్థాంతరంగా ఉండకూడదు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలి.." అని ఆదేశించారు.ఈ సందర్భంగా పలు మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సమీక్షించి, అవసరమైన నిధుల విడుదలపై అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి మరమ్మతులు, బావుల పునరుద్ధరణ, పంచాయతీ భవనాల నిర్మాణం వంటి పనులను వేగవంతం చేయాలని సూచించారు. సమీక్షా సమావేశంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఇంజినీర్లు తదితర అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి పట్ల చూపుతున్న చొరవ, ప్రతి ప్రాజెక్టును దగ్గరుండి పర్యవేక్షిస్తున్న తీరు అధికారులు, ప్రజలను ఆకట్టుకుంటోంది.





## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్

**పాలకుర్తి, అక్టోబర్ 23 (తెలంగాణ వారధి ) :** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు మారం రవికుమార్ అధ్యక్షతన సోమేశ్వర వేడుకల మందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలను మోసం చేస్తున్నారని ఆయన విమర్శించారు. శాసనసభలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు బీజేపీ మద్దతు తెలిపిందని, అయినప్పటికీ ప్రభుత్వం హైకోర్టులో కేసు వేయించి ఆపిందని అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లులో ఇతర మతస్థులను తొలగిస్తే పార్లమెంట్ లో బిల్లు ప్రవేశపెట్టడానికి బీజేపీ సిద్ధంగా ఉందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు సర్వేలతో ఒక వర్గానికి మాత్రమే మద్దతు ఇస్తోందని ఆయన విమర్శించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భాగాల నవీన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సతీష్, మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల దేవరాజు, ఉపాధ్యక్షుడు సంతోష్, నాయకులు శివకృష్ణ, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.




## ఎలక్ట్రిక్ బస్సుల డ్రైవర్ రిక్రూట్మెంట్

**హైదరాబాద్, అక్టోబర్ 23 (తెలంగాణ వారధి ):** ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు హయత్ నగర్ డిపో లో మెగా డ్రైవర్ రిక్రూట్మెంట్ జరుగుతుందని గురువారం అధికారులు తెలియజేశారు. హెవీ లైసెన్స్ తో పాటు హెవీ వెహికిల్ నడిపిన అనుభవం ఉండాలని, ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా హయత్ నగర్ బస్ డిపో2 నందు జరిగే ఇంటర్వ్యూలో పాల్గొనాలని మేనేజర్ రావుల మూర్తి ఒక ప్రకటన లో తెలియజేశారు. పూర్తి వివరాలకు 7075198417 నంబర్ లో సంప్రదించగలరు.




## నేడు భారత్ బంద్ కు మావోల పిలుపు

- ఆపరేషన్ కగార్ నిలుపుదలకు డిమాండ్
- అభయ్ పేరుతో ప్రకటన విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 23 (తెలంగాణ వారధి): కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ కగార్'పై మావోయిస్టు పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఆపరేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తూ నేడు భారత్ బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. మావోయిస్టు పార్టీ కేంద్ర అధికార ప్రతినిధి అభయ్ పేరుతో విడుదలైన ఒక ప్రకటనలో ఈ విషయం స్పష్టం చేశారు. 'ఆపరేషన్ కగార్'కు వ్యతిరేకంగా ఈ నెల 23వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణమే ఈ 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ మావోయిస్టు పార్టీ తమ బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చింది. ఈ ఆపరేషన్ తమ కార్యకలాపాలను అడ్డుకోవడానికి తమ ఉనికిని దెబ్బతీయడానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నంగా మావోయిస్టులు భావిస్తున్నారు. ప్రభుత్వాలు, భద్రతా బలగాలు తమ ఏరివేత చర్యలను ఉధృతం చేస్తున్న తరుణంలో మావోయిస్టు పార్టీ ఇచ్చిన ఈ భారత్ బంద్ పిలుపు దేశవ్యాప్తంగా ముఖ్యంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఉద్రిక్తతకు దారితీసే అవకాశం ఉంది. మావోయిస్టుల కార్యకలాపాలకు ఇది బలమైన సంకేతంగా కనిపిస్తోంది. బంద్ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. మావోయిస్టుల పిలుపుతో దేశంలో రవాణా, వ్యాపార కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే స్కూళ్లు, కాలేజీలపై ఈ బంద్ ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చు.


## యాదమ్మ కుటుంబానికి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సాయం



**పాలకుర్తి, అక్టోబర్ 23(తెలంగాణ వారధి ):** మండల కేంద్రానికి చెందిన పెన్నాం యాదమ్మ ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబాన్ని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ తరపున 25 కేజీల బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలు అందజేశారు. కుటుంబానికి అన్ని విధాల సహకారం అందిస్తామని ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి ఒర్రె కుమారస్వామి, మృతురాలి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జనగామ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉద్యోగావకాశాలు

**జనగాం, అక్టోబర్ 23 (తెలంగాణ వారధి ) :** జనగామ ప్రభుత్వ మెడికల్ కళాశాల మరియు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించారు. వాక్ఇన్ ఇంటర్వ్యూ నవంబర్ 5న చంపక్ హిల్స్ మాత శిశు సంరక్షణ కేంద్రంలో జరుగనుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10 నుండి 11 గంటల మధ్య అసలు సర్టిఫికట్లతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ నాగమణి తెలిపారు. దరఖాస్తులు www.gmc.jangaon.org లో లభ్యమవుతాయి.



epaper.telanganavaradhi.com
తెలంగాణ వారధి
సమగ్ర తెలుగు దినపత్రిక



# అమ్మ మాటకు విలువనిచ్చి 2,200 కి.మీ నడిచి..

- నయా రాముడంటూ ప్రశంసలు

**హైదరాబాద్, అక్టోబర్ 23 (తెలంగాణ వారధి) :** తండ్రి మాటకు కట్టుబడి నాడు రాముడు అడవులకు వెళ్లాడు. 14 ఏళ్లు వనవాసం అనుభవించాడు. అయితే తల్లిమాటకు కట్టుబడి నేడు 2200 కి.మీ పాదయాత్ర చేశాడో కొడుకు. నాడు రాముడి వెంట సీత అడవులకు వెళ్లగా నేడు ఈ కొడుకు వెంట ఆయన భార్య కూడా నడిచింది. వివరాల్లోకి వెళ్తే.. మనకు నాలుగు ఇంగ్లీష్ ముక్కలు రాగానే, పురాణాలను, దేశాన్ని, ఆచారాలను, సంప్రదాయాలను, పెద్దలను, సంస్కృతాన్ని విమర్శించే స్థాయికి వచ్చామని విర్రవీగుతుంటారు కొంతమంది. వాళ్ళకు బుద్ధి వచ్చే సంఘటన ఈ మధ్యనే జరిగింది.

దివాకర్ అనే వ్యక్తి రాసిన పోస్టు దీనికి మూలం. ''నాసిక్ హైవే మీద, రోడ్డు మీద వెళుతున్న జనాల వంక ఆసక్తిగా చూస్తున్న ఒక వృద్ధ జంటను చూసాను. చూడ్డానికి వాళ్ళు చాలా పేదవారిలా, ఏదో అవసరంలో ఉన్నవారిలా అనిపించింది. నేను వారికి ఆహారం కానీ, మరేదైనా సహాయం కావాలా అని అడిగి వారు మొహమాట పడుతుంటే, ఒక వంద రూపాయల నోటు ఇస్తే వాళ్ళు నిరాకరించారు. నేను వాళ్ళ గురించి అడిగితే వాళ్ళు చెప్పిన విషయం విని నా మతి పోయింది. వాళ్ళు 2200 కిలోమీటర్ల దూరాన్ని మూడు నెలల్లో కాలినడకన పూర్తి చేసి ''ద్వారక''కు తిరుగు ప్రయాణం చేస్తున్నారట. ఇల్లు చేరడానికి మరొక నెల పడుతుందట. అలా ఎందుకు నడవడం అని నేనడిగిన ప్రశ్నకు ఆయన నా చిన్నప్పుడు నా రెండు కళ్ళలోని చూపు పోతే, మా అమ్మ డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళింది. కానీ, అక్కడి డాక్టర్లు, ప్రపంచంలోని ఏ గొప్ప డాక్టరు కూడా కళ్ళు తెప్పించలేదని చెప్పారట. అయినా, వాళ్ళమ్మ పట్టుబట్టి ఆపరేషన్ చేయమని, ఫలితం భగవంతునికి వదిలేద్దామని చెప్పిందట. అంతేగాక, తన కొడుకుకు కంటి చూపు వస్తే, కొడుకుని కాలి నడకన పండరిపూర్, తిరుపతికి యాత్రకు పంపిస్తానని మొక్కుకున్నదట. అతనికి చూపు వచ్చిందట. అందుకని ఆ కొడుకు కాలి నడకన, అమ్మ కోరిక ప్రకారం యాత్ర పూర్తి చేసి, తిరుగు ప్రయాణంలో ద్వారకకు బయల్దేరారట. కానీ, మరి ఆ స్త్రీ ఎందుకు ప్రయాణం చేస్తుందనే ఆసక్తితో అడిగితే.. ఆమె 'నా భర్త ఒంటరిగా అంత దూరం కాలినడకన వెళ్ళడం ఇష్టం లేకా, దారిలో ఆయనకు అన్నపానీయాలు అమరుస్తూ, ప్రయాణంలో ముచ్చటించుకుంటూ సరదాగా గడపవచ్చని నడుస్తున్నానని' చెప్పింది. వాళ్ళిద్దరూ చక్కటి హిందీ, ఇంగ్లీషుల్లో మాట్లాడడం చూసి వారి చదువు గురించి ప్రశ్నించిన నాకు వారు



చెప్పిన సమాధానం విని మతిపోయింది. ఆ మగ వ్యక్తి ఆస్ట్రో_ఫిజిక్స్ లో పి.హెచ్.డి చేసి లండన్ లోని ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంలో ఏడేళ్ళు సీ రంగరాజన్, కల్పనా చావ్లాతో కలిసి పనిచేసాడట.

అతని భార్య లండనులోని ఒక విశ్వవిద్యాలయం నుండి హ్యూమన్_సైకాలజీలో_ పీ హెచ్ డి చేసిందని చెప్పేసరికి నాకు మూర్ఛ వచ్చినంత పనైంది. వాళ్ళ ముఖాల్లో అంత చదువుకున్నామనే, అంత గొప్పవారమనే ఛాయలు కనిపించడమే లేదు. వాళ్ళు చెప్పిన మరొక విషయం కూడా నన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. వాళ్ళకు వచ్చే పెన్షన్ మొత్తం అంధులకు సహాయం చేసే, ఒక ట్రస్టుకు విరాళంగా ఇస్తున్నారట. అతని పేరు డాక్టర్ దేవ్ ఉపాధ్యాయ. ఆమె పేరు డాక్టర్ సరోజ్ ఉపాధ్యాయ. తల్లి మొక్కును ఇప్పటికైనా తీర్చిన వాళ్ళిద్దరూ, ధన్యులు. ఇది కదా మన దేశపు ఔన్నత్యం.

---



# మహాగర్ బంధన్ సీఎం అభ్యర్థిగా తేజస్వీ

**పాట్నా, అక్టోబర్ 23 (తెలంగాణ వారధి) :** బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. మహాగర్ బంధన్ కూటమి సీఎం అభ్యర్థిగా ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్‌ను ప్రకటించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎన్నికల ఇన్ ఛార్జ్ అశోక్ గెహ్లాట్ గురువారం మీడియా సమావేశంలో ప్రకటించారు. ఇక డిప్యూటీ సీఎం అభ్యర్థిగా వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి) చీఫ్ ముఖేష్ సహానీని ప్రకటించారు. బీహార్ ప్రజలు మార్పుకు సిద్ధంగా ఉన్నారని, నితీష్ కుమార్ బీహార్ కు సీఎం అయ్యే అవకాశం ఎంతమాత్రం లేదని అశోక్ గెహ్లాట్ అన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మాత్రమే కాకుండా బీహార్‌ను పునర్నిర్మించడానికి మహాగర్‌బంధన్ కలిసి వచ్చిందని తేజస్వి యాదవ్ అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీ మద్దతు ఇచ్చినందుకు ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపారు. బీహార్ అభివృద్ధి పట్ల ఎన్డీఏకు స్పష్టమైన దృక్పథం లేదని తేజస్వి యాదవ్ ఆరోపించారు.

---




# రియల్ ఎస్టేట్ పేరుతో మోసం

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

**హనుమకొండ అక్టోబర్ 23 (తెలంగాణ వారధి) :** రియల్ ఎస్టేట్ వ్యాపార పేరుతో ప్రజలను మోసం చేసిన ఘరానా మోసం బయటపడింది. మంచిర్యాల జిల్లా రామిడి గ్రామానికి చెందిన సంపత్ రెడ్డి అనే వ్యక్తి 2021లో తాను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని చెబుతూ, తక్కువ ధరకు ప్లాట్లు ఇస్తానని బాధితులను నమ్మబలికాడు. ఈ క్రమంలో వివిధ వ్యక్తుల వద్ద నుండి సుమారు కోటి రూపాయలు వసూలు చేశాడు.అయితే డబ్బు తీసుకున్న తర్వాత భూములు చూపించకపోగా, వాయిదా వేస్తూ బాధితులను తప్పించుకున్నాడు. చివరకు బాధితులు జనవరి నెలలో హనుమకొండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గురువారం నిందితుడు సంపత్ రెడ్డిని అరెస్టు చేసినట్లు హనుమకొండ సీఐ శివకుమార్ తెలిపారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.





# జూబ్లీహిల్స్‌లో దయన్న ప్రచార హోరు

- గడప గడపకు వెళ్తూ.. వీధి వీధి తిరుగుతూ
- పాలకుర్తి నేతలతో కలిసి జోరుగా ప్రచారం
- ఆయన వెంట పసునూరి, పుస్కూరి, బబ్బూరి

**పాలకుర్తి, అక్టోబర్ 23 ( తెలంగాణ వారధి):** మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చన దగ్గరి నుంచి ఆయన తన టీమ్ తో కలిసి అక్కడే ఉంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు బీఆర్ఎస్ పార్టీకి చెందిన పాలకుర్తి నేతలతో కలిసి గడప గడప తిరుగుతూ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపినాథ్ గెలుపు కోసం అహర్నిషలు కృషి చేస్తున్నారు. పాలకుర్తి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్ రావు, ఆ పార్టీ రాష్ట్ర నేత బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ తదితరులు ఎర్రబెల్లి దయాకర్ రావు వెంట ప్రచారంలో పాల్గొంటున్నారు.



